"రాజమండ్రి బస్సు ఎన్నింటి కండీ?" అని ఆత్రుతగా అడిగాడు పరుగు పరుగున వచ్చిన ఆనందం.

"తెలియదు" అన్నాడు 'విచారణ' అనే బోర్డు ముందు కూచున్న గుమాస్తా చాలా విచారంగా.

# బస్ ప్రయాణం

స్వాతి చిత్రానంద

"బోర్డు సూడండి. ఆర్ని అడిగేదేటి?" అన్నాడు పక్కనే ఉన్న రైతు.

"చూశానండి. అంకెలు తెలియడం లేదు" అని గుమాస్తావైపు తిరిగి, "అసలు బస్సు ఎన్నింటికి రావా లండీ?" అని మళ్లీ అడిగాడు ఆనందం.

'పదీ, పదిన్నర, పదకొండు, పదకొండున్నర - ఇలా అర గంట, అర గంటకీ ఉన్నా యండి బస్సులు. కాని రావడం లేదు. ట్రాఫిక్కు జామ్ అనుకుంటా. లారీలూ రావడం లేదు' అన్నాడు గుమాస్తా.

నిరాశగా ఇటు తిరిగిన ఆనందం "ఇప్పుడు టైమెం తయిం దండీ?" అని అడిగాడు దూరంగా ఉన్న పెద్ద మనిషిని.

" గడియారం ఆగి పోయింది."

"టైమెంతయిం దండీ?" మరొకర్ని అడిగాడు.

"గడియారం తిరగడం లేదు."

"టైమెంత సార్?" ఇంకొకర్ని అడిగాడు.

"గడియారం రిపేర్-"

"టైమెంతండీ?"

"గడియారం నాది కాదు."

"టైమెంత మేష్టారూ?"

"అడ్డమైన వాళ్లకీ టైమ్ చెప్పడాని క్కాదు నా వాచీ-"

"టైమెంతండీ?" మరొకర్ని అడిగాడు.

"సూస్కో" అన్నాడు ధీమాగా - వాచీ ఆనందం ముఖం మీద పెడుతూ. పక్కనున్న జనం అంతా పకపకా నవ్వారు. ఆనందం బిక్కమొహం వేశాడు.

బాబూ! దరమం సెయ్యండి. గుడ్డి వాడి నండయ్యా!" అన్న అరుపు వినబడింది కొంచెం దూరంలో.

"పై కెళ్లు" అని ఉచితసలహా ఇచ్చాడు ధర్మాత్ముడు.

"అయ్యా దరమం" అంటూ కదిలాడు గుడ్డి వాడు.

★ ★ ★

"ఆ విగ్రహాలు ఎవరి వండీ?" అని అడిగాడు ఆనందం పక్కనున్న ఓ పెద్ద మనిషిని.

"కింద రాశారు గదండీ, సదువుకోండి" అన్నాడు ఓ ప్యాసింజరు చుట్ట కాల్చుకుంటూ.

"వర్షం బురద పడి, అక్షరాలు కనబడ్డం లేదండి. మొహాల్లో పోలిక ల్లేవండి. కాని మన వాళ్ల చాలా విగ్రహాలు పెట్టారండీ"అని ఆనందించాడు ఆనందం.

"ఆ ఇగ్గరాల సంగతి నే సెబుతా. గుడ్డి వాడిని దరమం సెయ్యండి" అంటూ గుడ్డి ముష్టి వాడు ఆనందం దగ్గరకు వచ్చాడు.

"చెప్పవయ్యా" అన్నాడు ఆనందం మరింత ఆనందంగా.

'మీరు ఆ ఇగ్గరాల ఏపు తిరగండి, సెబుతా.'

"తిరిగాను. చెప్పు."

"మీ ఎడం పక్క నుంది సూడండి, మొదటిది, మిలిటరీ డ్రెస్సులో - కళ్ల జోడు ఇరిగి పోయింది. మొలలో కత్తి కూడా ఇరిగి పోయింది."

"ఆఁ ... అవునవును."

"అది నేతాజీ సుభాస్ చంద్రబోస్‌ది. ఆ పక్క నుంది సూడండి - సేతిలో కర్ర ఇరిగి పోయింది, కళ్ల జోడు లేదు. బొడ్డులో వాచీ, బోడి గుండు మీద కాకి రెట్టలు. అది మహాత్మా గాంధీ."

"అవును. కాస్తంత పోలిక ఉంది."

"ఆయన పక్కన టోపీలో ఉన్నది నెహ్రూ గారు. ఆయన పక్కన ముసు గేసుకున్న ఆడ మనిషి ఇందిరా గాంధీ. ఆమె గారి పక్కన ఆమెగారి కొడుకు రాజీవ్ గాంధీ. అత్తా కోడలు అంచు కండువా మెడలో - అంచులు ఎలిసి పోయా యనుకోండి. ఆ పక్కన కుడి పాపిడి - పాంట్ జేబులో చెయ్యి - ఆయన వంగవేటి రంగా. ఆ పక్కన పంచె, లాల్చీ, శాలువా ఏసుకుని చెయ్యెత్తాడు సూడండి, ఆయన ఎన్టీఆర్. ఆ పక్కన కుడి సెయ్యి ఎడం సేతిలో పుస్తకం ఆయన అంబేద్కర్."

"బాగుందయ్యా. ఆయన పక్కన పీఠం మాత్రం ఉంది. అది?"

"అది మా సర్పంచ్ గారు కట్టించా రండి. మరి, ఆయన ఎవరిది పెట్టించా లనుకున్నారో! ... ఒకేళ ఆయనదే పెడతారేమో తెల్దండి."

"అదేవిటయ్యా?"

"అదంటే నండి. ఆయన సావుబతుకుల్లో ఉన్నారు గదండీ?"

"బావుందయ్యా మరి. నువ్వు గుడ్డి వాడి నంటావు గదా! ఇవన్నీ నీకెలా తెల్సు? ఎప్పుడు చూశావు?"

"అయి సూసింతర్వాతే నా కళ్లు పోయా యండి."

"అయ్యో! అలాగా? ఇంద" అని ఓ రూపాయి నోటు ఇచ్చాడు.

"ఎంతండి బాబూ?" అన్నాడు నోటు తిప్పుకుంటూ.

"రూపాయి" అన్నాడు పది రూపాయ లిచ్చినంత గొప్పగా.

"రూపాయి మామూలు ముష్టి కయితే నండి. మరి నేను ఈ ఇగ్గరాల ఇవరాలన్నీ చెప్పా గదండి మరి?"

"హోర్నీ! అసాధ్యం గూలా! సర్లే ఇంద" అని ఇంకో రూపాయి ఇచ్చాడు.

"చాలా థాంక్సండి" అని గుడ్డి ముష్టి వాడు మామూలుగా నడిచి వెళ్లి పోతున్నాడు.

ఆనందం వెళ్లి అతని చొక్కా పట్టుకున్నాడు."మోసం! పచ్చి మోసం!" అని అరిచాడు.

"మోసం లేదు, ఏం లేదు చూడండి" అని అటు తిరిగి ఏదో కళ్లల్లో పెట్టుకుని, మళ్లీ ఆనందరావు వైపు తిరిగాడు.

"నా కళ్లు సూడండి. సిరంజీవులు సినిమాలో ఎన్టీఆర్ కళ్లలా లేవూ? కావాలనుకుంటే గుడ్డి. వద్దనుకుంటే లేదు. దట్సాల్!"

'గుడ్డి వాడినని నటించి డబ్బు గుంజుతావా?'

"మీరు మాత్రం? మీరు చదువుకుని, ఆఫీసుల్లో ఫేన్ కింద కూచుని గుమాస్తా లాగ నటిస్తూ డబ్బు

సంపాదిస్తున్నారు. నేనూ చదువుకున్నా. ఉద్యోగం లేక, గుడ్డి వాడిలా నటిస్తూ డబ్బు సంపాదిస్తున్నా. ఇద్దరం ఒకటే!" అని కదిలాడు.


"మరి అలా వెళ్లి పోతావేం, అడుక్కోక?"

"మధ్యాహ్నం ఎండ గదండీ? వన్ టు ఫోర్ బ్రేక్" అని వెళ్లి పోయాడు.

ఆనందం ఆశ్చర్యంగా అతన్నే చూస్తూ నిలబడి పోయాడు.

మబ్బులు కమ్ముతున్నాయి.

వాన వచ్చేలా ఉంది.



చీకటి పడుతోంది.

ఇంతలో బస్సు వచ్చింది.

"రాజమండ్రి బస్సు - రాజమండ్రి బస్సు!" అని అరుపులు.

ఆ గోలతో ఆనందం ఈ లోకంలోకి వచ్చాడు. అతనూ హడావిడిగా బస్సులోకి దూరాడు. కండక్టర్ చేతిలో నూర్రూపాయల నోటు పెట్టి, "అడంగుకి' అన్నాడు.

టిక్కెట్టు ఇచ్చాడు కండక్టర్.

"మరి చిల్లర?" అన్నాడు ఆనందం.

"సిల్లర లేదు. అసలు గవర్నమెంటు దగ్గిరే డబ్బు లేదు. నా దగ్గి రెక్కడుంటాది? ఎల్లండి. అడంగు కెల్లాక సూసుకుందాం. టికెట్ ఎనకాల రాశా" అనాడు కండక్టర్.

ఆనందం వెనక్కి వెళ్లాడు. సీటు దొరికింది. 'హమ్మయ్య' అనుకున్నాడు. మూలకి జరిగి, కళ్లు మూసుకుని వాలిపోయాడు. ఆ రోజు పడ్డ శ్రమ అంతా మరిచిపోయాడు.

బస్సు పోతోంది.

"అస్సలు పీవీ నరసిమ్మారావు గారు-" అని ఎవరో మొదలు పెట్టారు.

"అయ్యా! బస్సులో రాజకీయాలు మాట్లాడకండి. కావాలంటే బూతులు మాట్టాడండి. అడంగు ల్లేరు కనుక" అన్నాడు కండక్టర్.

ప్రయాణికులంతా గొల్లున నవ్వారు, ఆనందం తప్ప. అతను నిద్ర పోతున్నాడు.

డ్రైవరు మాత్రం చాలా జాగ్రతగా ఏ విధమైన యాక్సిడెంట్లూ చేయకుండా బస్సును అడంగుకు చేర్చాడు.

అంతా దిగారు.

ఆనందం మాత్రం దిగలేదు. కునికిపాట్లు పడుతూనే ఉన్నాడు.

కండక్టర్ అతని పరిస్థితి చూశాడు. 'మందు' కొట్టి పడుకున్నాడు అనుకున్నాడు. అతని దగ్గరకు వచ్చి "లే గురూ! ఎక్సయిజోళ్లు సూత్తే నా పీకల మీద కొస్తాది" అన్నాడు.

ఆనందం లేవ లేదు. కండక్టర్ అతని జేబులు తడుముతున్నాడు, ఏదన్నా సీసా కనబడితే తీసి బయటకు విసిరేద్దామని.

ఆనందం హఠాత్తుగా లేచాడు.

"దొంగ! దొంగ!" అని అరిచాడు.

'దొంగ కాదు గురూ! నేను కండక్టర్ని. 'మందు' కొట్టి ప్రయాణం చెయ్యొచ్చా? అందులోనూ నా బస్సులో? నీలాటోణ్ని ఎక్కించుకున్నందుకు నన్ను బొక్కలోకి తోస్తారు. పిల్లలు గలోణ్ని. దిగు దిగు!'

"మరి నా చిల్లరో?"

"ఇంద" అని చిల్లర చేతిలో పెట్టాడు.

"అప్పుడే రాజమండ్రీ వచ్చేశామా?" అన్నాడు ఆనందం చిల్లర తీసుకుంటూ.

"రాజమండ్రీ యేంటి? ఇది అమలాపురం" అన్నాడు కండక్టర్.

"ఇది అమలాపురమా? ఈ బస్సు అమలాపురం వెళ్తుందని చెప్పొద్దూ?" అని దబాయించాడు ఆనందం.

"నువ్వు అడగొద్దూ? ... అసలు బస్సెక్కే వోడివి బోర్డు సూసుకుని ఎక్కొద్దూ?"

"చూసుకునే ఎక్కాను. రాజమండ్రి అని ఉంది' ' అన్నాడు ఆనందం.

"అయితే క్లీనరు బోర్డు మార్చలే దన్న మాట! అసలు నువ్వు ఏ బోర్డు సూసుకు ఎక్కావు? ఎదరిదా? ఎనకదా? అసలు టిక్కట్టు అడిగే వోడివి - ఊరు పేరు చెప్పకుండా 'అడంగుకి' అంటే ఏంటి అర్థం?"

"........"

"ఎళ్లు, ఆలిస్సెమైతే లాస్ట్ బస్సు కూడా ఎళ్లి పోద్ది."

ఆనందం లేచి బస్సు దిగుతున్నాడు. అతని పరిస్థితికి జాలి పడిన కండక్టర్ "సూడు బాబూ! ఓ సిన్న మనవి. 1. నువ్వు ఎక్కదల్చుకున్న బస్సు, నువ్వు ఎల్లాల్సిన వూరికేనా అని అడిగి మరీ ఎక్కు. 2. బోర్డుల్ని నమ్మకు. 3. ఊరు పేరు సెప్పి కండక్టర్ దగ్గర టిక్కట్టు కొనుక్కో. 4. బస్సులో నిద్దరోకు. 5. టిక్కట్టుకు సరి పడ్డ డబ్బు సేతిలో పట్టుకుని, మిగతా డబ్బులు నీ బనీను లోపల పెట్టుకో" అని అయిదు సూత్రాలు ఉపదేశించాడు.

ఆనందం ఈ బస్సు ఎంత హుషారుగా ఎక్కాడో, అంత నీరసంగా 'నిజం రాజమండ్రి' బస్సు ఎక్కాడు. కండక్టర్ చెప్పిన అయిదు సూత్రాలూ మననం చేసుకున్నాడు. అన్నీ పాటించాడు, తు.చ. తప్పకుండా. నిలబడే షరతు మీద ఆనందాన్ని కండక్టర్ లోపలకు పంపాడు.

అతను అడిగి తీసుకున్న టిక్కట్టు రాజమండ్రీకే. ఆ బస్సు వెళ్లేదీ రాజమండ్రీకే.

'ఆలస్య మైతేనేం, అంతిమవిజయం నాదే' అనుకున్నాడు ఆనందం.